# కలం

ప్రజల గళం...

kalamdaily.com

Follow on: Kalamtelugu

బుధవారం | 29-04-2026

పేజీలు: 4


360° SINGLE TOPIC

## సన్ స్ట్రోక్




# నిప్పుల కొలిమి

## ఎండకు ఉడుకెత్తిపోతున్న ఊళ్లు

రికార్డు స్థాయిలో టెంపరేచర్లు నమోదు

భయపెట్టిస్తున్న 'సూపర్ ఎల్‌నినో' ఎఫెక్ట్

'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్'పై సర్కార్ నిర్లక్ష్యం

సింగరేణి గనుల్లో మండుతున్న బొగ్గు

అడుగంటుతున్న భూగర్భ జలాలు

అర్బైనజేషన్‌తో కాంక్రీట్ జంగిల్‌గా నగరాలు

అడవుల నరికివేతతో స్వయంకృతాపరాధం




ఆహ్లాదకరమైన వాతావరణానికి హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్. అలాంటి కూల్ క్లైమేట్ ఉన్నందునే ఒకప్పుడు హైదరాబాద్‌లో 'గరం సూటర్ల'కు (స్వెట్టర్) మంచి డిమాండ్ ఉండేది. నగరంలోని చాలా ప్రాంతాలకు 'బాగ్' అనే పేర్లు వచ్చాయి. ఇప్పుడు అలాంటి హైదరాబాద్ 'హీట్ చాంబర్'లా మారిపోయింది. ఏప్రిల్‌లోనే ఎండలు దారెత్తిస్తున్నాయి. రోహిణికార్తెకు ముందే రోళ్లు పగిలేలా టెంపరేచర్ పెరిగిపోతున్నది. ప్రతి ఏటా సమ్మర్‌లో 'హయ్యెస్ట్' అనే రికార్డులు నమోదవుతున్నాయి. రెండు దశాబ్దాలుగా అర్బనైజేషన్‌తో సిటీ సహా రాష్ట్రమంతా అగ్నిగుండంగా మారింది.

ఇక బొగ్గు నిక్షేపాలున్న రామగుండం, మంచిర్యాల, కొత్తగూడెం లాంటి గనుల ప్రాంతాల్లో ఎండలు నిప్పులు కక్కుతున్నాయి. ఖమ్మంలో 2015లో నమోదైన 47.6 డిగ్రీల ఉష్ణోగ్రతలే రాష్ట్రంలో ఇప్పటివరకు ఆల్ టైమ్ హై. ఇప్పుడు ఒక్క ఖమ్మంలోనే కాదు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో అంతకంటే ఎక్కువ స్థాయిలో టెంపరేచర్ రికార్డవుతున్నది. రోళ్లు పగులుతున్నాయి.. కార్లు తగలబడుతున్నాయి.. ప్రజలు వడదెబ్బ బారిన పడుతున్నారు.. ఏటేటా 'హీట్ స్ట్రోక్ డెత్స్' పెరిగిపోతున్నాయి. ఏసీలు లేని ప్రజల బాధలు వర్ణనాతీతం.

సామాన్యులకు అర్థం కాని 'ఎల్‌నినో', 'లానినో', 'కార్బన్ ఎఫెక్ట్', 'గ్రీన్ హౌజ్ గ్యాసెస్', 'హ్యూమిడిటీ'.. ఇలాంటివాటి ప్రభావం ఎలా ఉన్నా నిన్నటిదాకా పచ్చగా నీడనిచ్చిన చెట్లు ఇప్పుడు అపార్టుమెంట్ల నిర్మాణం కోసం నేలకూలుతున్నాయి. దేవుళ్ల విగ్రహాల ఊరేగింపుల కోసం, విద్యుత్ వైర్ల కోసం చెట్ల కొమ్మలు రాలిపడుతున్నాయి. హరితహారం, వన మహోత్సవం.. ఇలాంటి ఎన్ని పేర్లతో మొక్కలు నాటుతున్నా ఏపుగా పెరిగిన చెట్లను నరికేస్తున్నాం. కొత్త సచివాలయం కోసం వేలాది చెట్లను వేళ్లతో సహా పీకేశాం. ఇప్పుడు అక్కడ నీడ కోసం అవస్థలు పడుతున్నాం.

ఎండలకు తోడు భూగర్భ జలాలు అడుగంటి 'ప్యాకేజ్డ్ వాటర్' పేరుతో క్యాన్లలో కొనుక్కుని తాగుతున్నాం.. వాడుకోడానికి ట్యాంకర్లతో తెప్పించుకుని సంప్‌లలో నింపుకుంటున్నాం. ఒకవైపు కాంక్రీట్ స్ట్రక్చర్లు, మరోవైపు వాహనాల కాలుష్యం, చెరువుల ఆక్రమణ, పార్కుల కబ్జాలు... జనానికి చల్లదనం లేకుండా చేస్తున్నాయి. ఇంకుడు గుంతలు, ఇంటికో చెట్టు.. ఇవన్నీ కాగితాలకే పరిమితం. చేసుకున్నోడికి చేసుకున్నంత అంటూ మన స్వయంకృతాపరాధంతో మన తర్వాతి తరాలనూ ఇబ్బందుల్లోకి నెడుతున్నాం.

వడదెబ్బకు ఏటా మన దగ్గర ఎంత మంది చనిపోతున్నారు.. హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్‌పై ప్రభుత్వానికి నిర్లక్ష్యమెందుకు.. టెంపరేచర్ నియంత్రణలో ప్రభుత్వాల పాత్ర ఏంటి.. ప్రజలను భాగస్వామ్యాన్ని పెంచడంలో ఉదాసీనత ఎందుకు.. ఎల్‌నినో, లానినో లాంటి మార్పులకు కారణమెవరు..? వీటన్నింటిపై కలం 360 స్పెషల్..


- సెంట్రల్ డెస్క్, కలం




## రామగుండం హాట్‌స్పాట్

తెలంగాణ పెద్దపల్లి జిల్లా రామగుండంను 'హాట్‌స్పాట్'అని పిలుస్తుంటారు. ఇక్కడ ఉష్ణోగ్రతలు తరుచూ 45 డిగ్రీలు దాటుతున్నాయి. 20 ఏండ్లలో రాష్ట్రంలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, నిజామాబాద్ జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు రికార్డ్ అవుతున్నాయి. 2015లో ఖమ్మంలో నమోదైన 47.6 డిగ్రీలు ఆల్ టైమ్ హై. ఆ తర్వాత 2019లో రామగుండం, 2024 మంచిర్యాల జిల్లా భీమారంలో 47.2 డిగ్రీలు నమోదు.

- తెలంగాణలో 20 ఏండ్లలో రాష్ట్ర సగటు ఉష్ణోగ్రత అత్యధికం 42 డిగ్రీలు. అత్యల్పం 12 నుంచి 15 డిగ్రీలు.
- రామగుండం ఏరియా 20 ఏండ్లలో 10 సార్లు రాష్ట్రంలోనే అత్యంత వేడి ప్రాంతంగా నిలిచింది. ఇక్కడి బొగ్గు గనులు, పరిశ్రమలే రికార్డు టెంపరేచర్ల నమోదుకు కారణం.
- 2015 నుంచి సాధారణ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలుగా నమోదువుతున్నది. ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల్లో హీట్ వేవ్ ముప్పు ఎక్కువ.







## భూమిలో ఆవిరవుతున్న తేమ

తెలంగాణలో నమోదవుతున్న రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు.. ఆర్థిక, సామాజిక, ఆరోగ్య వ్యవస్థలపై ప్రభావం చూపుతున్నాయి. వ్యవసాయ రంగంపై ప్రభావం పడుతున్నది. వేడి కారణంగా భూమిలోని తేమ ఆవిరైపోతున్నది. ఇది పంట ఎదుగుదలను దెబ్బతీస్తున్నది.

- వరి, జొన్న వంటి పంటల దిగుబడి తగ్గుతున్నది. పచ్చిక బయళ్లు ఎండిపోవడంతో పశువులకు మేత దొరకడం లేదు. వేసవిలో ఏసీలు, కూలర్లు, వ్యవసాయ పంపుసెట్ల వాడకం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. 2026, మార్చిలో 18వేల మెగావాట్ల పీక్ డిమాండ్ క్రాస్. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఆదిలాబాద్, ఖమ్మం వంటి జిల్లాల్లో దట్టమైన అడువులు ఉన్నాయి. ప్రజలకు సమ్మర్ హీట్ నుంచి ఉపశమనం లేదు. అమ్రాబాద్, కవ్వాల్ వంటి టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో నీటి కుంటలు ఎండిపోవడంతో వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయి. గ్రామస్తులపై అవి దాడులకు దిగుతున్నాయి.

## సింగరేణిలో 49 డిగ్రీల సెగ

ఉత్తర తెలంగాణలోని మంచిర్యాల, రామగుండం, కొత్తగూడెం, బెల్లంపల్లి ప్రాంతాల్లో సింగరేణి ఓపెన్ కాస్ట్ గనులు ఉన్నాయి. ఈ ప్రాంతాలన్నీ హీట్ చాంబర్స్‌లా మారాయి. ఇక్కడ సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు అదనంగా రికార్డ్ అవుతున్నది. బయట 45 డిగ్రీలు ఉంటే.. లోపల 49 డిగ్రీలకు చేరుతున్నది. దీంతో కార్మికులకు ఊపిరి ఆడటం కష్టంగా మారింది.

- బొగ్గు తవ్వేందుకు వాడే భారీ షవల్స్, డంపర్లు, డ్రిల్లింగ్ మిషన్లు వేడిని రిలీజ్ చేస్తున్నాయి. ఎండల తీవ్రత కారణంగా బొగ్గు కుప్పలు దానంతట అవే మండుతున్నాయి. ట్రేడ్ యూనియన్ల రిక్వెస్ట్ మేరకు కొన్ని సార్లు షిఫ్ట్ టైమింగ్‌ను అధికారులు మారుస్తున్నారు. గనుల్లో దుమ్ము లేవకుండా, కార్మికులకు తాగడానికి నీటి అవసరం ఎక్కువ ఉన్నది. ఎండల కారణంగా చెరువులు ఎండిపోవడంతో నీటి నిర్వహణ సవాల్‌గా మారింది.





## తగ్గిన మధ్యస్థ అడవుల విస్తీర్ణం

2026 పూర్తయ్యే నాటికి తెలంగాణలో అటవీ విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇండియన్ స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ నివేదిక ప్రకారం.. తెలంగాణ రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణం 1.12 లక్షల చదరపు కిలో మీటర్లు కాగా, ఇందులో 2015 నాటికి 26,904 చదరపు కిలో మీటర్ల ఉన్న అటవీ విస్తీర్ణం 2023 నాటికి 27,688 చదరపు కిలో మీటర్లకు (2.91శాతం) పెరిగింది. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే అడవుల్లోని కార్బన్ నిల్వలు తగ్గాయి.

- ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకారం.. 2013–14లో 513 చ.కి.మీగా ఉన్న అత్యంత దట్టమైన అడవుల విస్తీర్ణం.. 2021–22లో 1,613.32 చ.కి.మీ (214శాతం) పెరిగింది. ఇదే సమయంలో మధ్యస్థ అడవుల విస్తీర్ణం 12,712 చ.కి.మీ నుంచి 8,909 చ.కి.మీ (29.91%)కు తగ్గింది.
- 2025, సెప్టెంబర్ నాటికి గత ఆరేండ్లలో రాష్ట్రంలో అడవులు నిల్వ చేసే కార్బన్ 12.57 శాతం క్షీణించింది. ఫలితంగా వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ శాతం పెరిగింది. ఫలితంగా గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు పెరిగాయి.
- ఇండియన్ స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్ 2023–2026 గణాంకాల ప్రకారం.. ఫారెస్ట్ కవర్ 21,214 చ.కి.మీ. కొత్తగూడెం, ములుగు, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో అత్యధిక గ్రీన్ కవర్.



# ఉపాధి కూలీలకు ఎండ దెబ్బ

తెలంగాణలో ఉపాధి హామీ కూలీలకు ఎండాకాలం అత్యంత సవాల్‌తో కూడుకున్న సమయం. మధ్యాహ్నం పని చేయకుండా ఉండేందుకు పని వేళలు మార్చారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకే పని చేయిస్తున్నారు. పని ప్రదేశాల్లో కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి 50 మంది కూలీలకు ఒక నీటి ట్యాంకర్ లేదా సరిపడా తాగునీరు అందుబాటులో ఉండాలనే నిబంధన ఉన్నా.. ఎక్కడా అమలు కావడం లేదు. తాత్కాలిక టెంట్లు, షామియానాలు ఎక్కడా కనిపించడం లేవు. వడదెబ్బకు గురైన కూలీలకు ఇచ్చేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గ్లూకోజ్, అవసరమైన మందులు నిండుకున్నాయి. గంటల తరబడి ఎండలో పని చేయడంతో చర్మ వ్యాధుల సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎండ తీవ్రత కారణంగా కూలీలు అలిసిపోతున్నారు. అనుకున్న పని పూర్తి చేయలేకపోతున్నారు. దీంతో కూలి డబ్బులు తక్కువ వస్తున్నాయి.




మార్చి ఆరంభంలోనే ప్రభుత్వం 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్' రిలీజ్ చేయాలి. కానీ, ఈసారి విడుదల చేయలేదు. ఎండలకు సంబంధించి వాతావరణ శాఖ నుంచి హెచ్చరికలు అందినా.. అవి జిల్లాల వరకు చేరలేవు. ఉష్ణోగ్రత తీవ్రతను బట్టి ఎల్లో, ఆరెంజ్, రెడ్ అలర్ట్‌ను జారీ చేయాలి. కానీ, ఇది జిల్లా స్థాయిలో అమలు కావడం లేదు.

## మే వస్తున్నా రిలీజ్ కాని హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్

### హీట్ యాక్షన్ ప్లాన్ లక్ష్యాలు

- మార్చి ఆరంభంలోనే విడుదల
- వాతావరణ హెచ్చరికలు జిల్లాల వరకు
- ఉష్ణోగ్రతను బట్టి అలర్ట్‌లు
  - ఎల్లో అలర్ట్ 'జాగ్రత్త'
  - ఆరెంజ్ అలర్ట్ 'సిద్ధంగా ఉండండి'
  - రెడ్ అలర్ట్ చర్యలు చేపట్టండి'
- జిల్లా స్థాయిలో అమలు

### అమలు కావలసిన చర్యలు

**ప్రజలకు అవగాహన**
రేడియో, టీవీ, సోషల్ మీడియా ద్వారా అప్రమత్తం

**వైద్యులకు శిక్షణ**
వైద్యులకు శిక్షణ
ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవి ఫ్లూయిడ్స్, ఐస్ ప్యాక్‌ల లభ్యత

**ప్రభుత్వ ఆస్పత్రులలో హీట్ వార్డులు**
- ఏసీలు, కూలర్లు ఏర్పాటు
- వడదెబ్బ బాధితుల కోసం ప్రత్యేక వార్డు

**పీహెచ్‌సీల్లో మందుల నిల్వలు**
ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవి ఫ్లూయిడ్స్, ఐస్ ప్యాక్‌ల లభ్యత

**రద్దీ ప్రాంతాలలో సౌకర్యాలు**
- చలివేంద్రాల ఏర్పాటు
- కలర్ రూఫ్ (తెల్లని రంగు వేయడం)

**కలర్ రూఫ్స్**

తీవ్ర ఎండల నుండి ప్రజల రక్షణ కోసం...

## హైదరాబాద్‌లో ట్యాంకర్లతో నీళ్ల సప్లై

హైదరాబాద్‌లో నీటి కటకట పెరిగింది. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. నాగార్జున సాగర్, మంజీర నుంచి వాటర్ సప్లై తగ్గిపోయింది. దీంతో హైదరాబాద్ వాసులు ట్యాంకర్ల ద్వారా నీళ్లు తెప్పించుకుంటున్నారు. గత మూడేండ్లలో ఎండాకాలంలో నీటి ట్యాంకర్ల వినియోగం పెరిగింది.

- 2024 జనవరిలో 85,331 ట్రిప్‌లు, ఫిబ్రవరిలో 1,15,684, మార్చిలో 1,81,344, ఏప్రిల్‌లో 2,63,037, మేలో 2,43,990 ట్రిప్‌లు.
- 2025 జనవరిలో 1,19,752, ఫిబ్రవరిలో 1,77,733, మార్చిలో 2,68,908, ఏప్రిల్ లో 2,78,896, మేలో 2,74,660 ట్రిప్‌లు.
- 2026 జనవరిలో 1,08,758, ఫిబ్రవరిలో 1,40,664, మార్చిలో 2,24,421, ఏప్రిల్ 14 వరకు 1,18,901 ట్రిప్‌లు.
- 2026 యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఏప్రిల్‌లో 85 ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ల వర్క్ అవుతున్నాయి. వీటిలో 47 ఫిల్లింగ్ స్టేషన్లు క్రిటికల్/హై డిమాండ్ ఏరియాల్లో ఉన్నాయి.
- 2025, ఏప్రిల్‌లో 138 ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లు ఉంటే.. 2026 ఏప్రిల్ నాటికి 142కు పెరిగాయి. వీటిలో 88 స్టేషన్లు క్రిటికల్/హై డిమాండ్ ఏరియాల్లో ఉన్నాయి.
- మొత్తం 1,200 వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సప్లై జరుగుతున్నది.



kalamdaily.com
Follow us on: Kalamtelugu

2015, మేలో తెలంగాణను భీకరమైన వడగాల్పుల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. 2015లో నమోదైన వందలాది మరణాల నేపథ్యంలో అటువంటి ప్రాణ నష్టం మళ్లీ జరగకుండా చూడటమే ఈ ప్లాన్ ముఖ్య ఉద్దేశం.

# వడదెబ్బ కు పిట్టల్లా రాలుతున్న జనం: తెలంగాణ 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్' ఫలితాలు







## పెరుగుతున్న పారిశ్రామికీకరణ

అడవులు వాతావరణంలోని వేడిని పీల్చుకుంటాయి. ప్రాజెక్టుల కోసం వేల ఎకరాల అడవులను నరకడంతో భూమి వేడెక్కుతున్నది. ఉత్తర తెలంగాణలో దట్టమైన అటవీ ప్రాంతం. ప్రాజెక్టులు, మైనింగ్, పారిశ్రామికీకరణతో పలచబడింది. దీంతో ఇక్కడ టెంపరేచర్ 45 నుంచి 47 డిగ్రీలకు చేరుతున్నది. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. నగరాల్లో చెరువుల పూడ్చివేత, కాంక్రీట్ నిర్మాణాలు పెరగడంతో వర్షపు నీరు భూమిలోకి వెళ్లడం లేదు. దీంతో అర్బన్ హీట్ ఐలాండ్ ప్రభావం పెరిగి చుట్టుపక్క ప్రాంతాల కంటే నగరంలో వేడి ఎక్కువవుతున్నది.

## వాహన కాలుష్యంతో పెరుగుతున్న హీట్

వాహనాల్లో పెట్రోల్ లేదా డీజిల్ మండటంతో కార్బన్ డయాక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్ వాయువులు విడుదలవుతున్నాయి. ఈ వాయువులు వాతావరణంలో ఒక పొరలా ఏర్పడుతున్నాయి. ప్రతి వాహనం ఒక చిన్న హీటర్ లాంటిది. వేలాది వాహనాలు ఒక చోట ఆగి ఉన్నప్పుడు అవి విడుదల చేసే వేడితో ఆ ప్రాంతంలో ఉష్ణోగ్రత చుట్టుపక్కల కంటే 2 నుంచి 3 డిగ్రీలు ఎక్కువ ఉంటున్నది.

- తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ లెక్కల ప్రకారం.. 2025, మార్చి 31 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా వాహనాల సంఖ్య కోటి 80 లక్షలు. ప్రతి రోజు కనీసం 3వేలకు పైగా కొత్త వాహనాలు రోడ్డెక్కుతున్నాయి మొత్తం వాహనాల్లో మోటార్ సైకిళ్లు 1.27 కోట్లు, కార్లు 23 లక్షలు, ట్రాక్టర్లు, ట్రైలర్లు 7.74 లక్షలు, గూడ్స్ క్యారేజీ వాహనాలు 6.56 లక్షలు, ఆటో రిక్షాలు 5.14 లక్షలు ఉన్నాయి.





## ముంచుకొస్తున్న సూపర్ ఎల్‌నినో

పసిఫిక్ సముద్రంలో ప్రస్తుతం 1 డిగ్రీ సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత ఉన్నది. సెప్టెంబర్ నాటికి 2 డిగ్రీల కన్నా ఎక్కువగా పెరిగి సూపర్ ఎల్‌నినో పరిస్థితులకు దారితీస్తాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. 1876–1877 వచ్చిన సూపర్ ఎల్‌నినోతో ప్రపంచ వ్యాప్తంగా కరువు విలయతాండవం చేసింది. సుమారు 5 కోట్ల మంది నీళ్లు, తిండి లేక చనిపోయారు. ఇప్పుడు ముంచుకొస్తున్న ఎల్‌నినో ప్రభావం తెలంగాణపైనా ఎక్కువే ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నది. ఇప్పటికే ఇచ్చిన ఔట్ లుక్‌లో జులై నాటికి ఎల్‌నినో బలపడుతుందని పేర్కొన్నారు. అంతకంటే ముందే ఎల్ నినో ఎంటర్ అయితే ప్రభావం తీవ్రంగా ఉంటుంది. రాష్ట్రంలో వర్షాధార పంటలేవీ లేనప్పటికీ.. నదీ జలాలపైనే ఆధారపడినందున ఎఫెక్ట్ ఎక్కువే ఉంటుందని ఐఎండీ హెచ్చరిస్తున్నది.ఎండల తీవ్రత పెరుగుతుంది. పంటలు సరిగా పండవు. పువ్వులు, కాయలు రావు. దిగుబడి భారీగా తగ్గిపోతుంది. నదులు, చెరువుల్లో నీరు బాగా తగ్గిపోతుంది. మే 2వ వారంలో ఎల్‌నినోపై స్పష్టత వస్తుంది.